




# కరపత్రం

SINCE 2014

సోమవారం ఏప్రిల్ 13, 2026 | సంపుటి : 2 | సంచిక : 182 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## నారీ శక్తి వందన సమ్మేళనం..

# హాజరుకానున్న మోదీ

» నారీ శక్తి వందన సమ్మేళనం ఏప్రిల్ 13న ఢిల్లీలో నిర్వహణ
» నరేంద్ర మోదీ హాజరు, ప్రసంగం ఉదయం 11 గంటలకు
» విజ్ఞాన్ భవన్‌లో కార్యక్రమం
» వివిధ రంగాల మహిళా ప్రతిభావంతుల పాల్గొనడం
» “వికసిత భారత్ 2047”లో మహిళల కీలక పాత్రపై దృష్టి
» అన్ని స్థాయిల్లో మహిళల భాగస్వామ్యం పెంపే లక్ష్యం

ఢిల్లీ:
వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా (సోమవారం, ఏప్రిల్ 13వ తేదీ) ఢిల్లీలో నారీ శక్తి వందన సమ్మేళనం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరై మహిళలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుంది. వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ, విద్యా, విజ్ఞాన, క్రీడలు, వ్యాపార, మీడియా, సామాజిక సేవ, సాంస్కృతిక రంగాల మహిళా ప్రతిభావంతులు హాజరవుతారు. వికసిత భారత్ 2047 లక్ష్యానికి మహిళా ఆధారిత అభివృద్ధి కీలకమని ఈ సమ్మేళనం ద్వారా తెలియజేయనున్నారు ప్రధాని మోదీ. పార్లమెంట్ నుండి పంచాయతీల వరకు అన్ని స్థాయిల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలనేది ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం.



## పార్టీ పేరు మార్పుపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

- BRSగా మార్చిన తర్వాత నష్టపోయామని అంగీకారం
- మళ్లీ TRS పేరుకే రావాలని అభిప్రాయం
- “మేం తప్పులు చేశాం.. అందుకే ఓడిపోయాం” వ్యాఖ్య
- ప్రజా సమస్యలపై పాదయాత్ర చేస్తానని ప్రకటించారు
- ఇతర పార్టీలతో పొత్తులు ఉండవని స్పష్టం

మంచిర్యాల:
పార్టీ పేరు మార్పుపై మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతన పల్లిలో బీఆర్ఎస్ కారకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. టిఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ పార్టీగా మార్చిన తర్వాత నష్టపోయాం. మళ్లీ టీఆర్ఎస్‌గా ఉండాలని కోరుకుంటున్నాం. ప్రజా సమస్యలపై పాదయాత్ర చేస్తా. మేం తప్పులు చేశాం.. అందుకే ఓడిపోయాం. తల్లిదండ్రులను సంతోష పెట్టకపోయినా పర్వాలేదు.. బాధపెట్టొద్దు. కొత్త పార్టీలు ఎన్ని వస్తే అంత మంచిది.. ఓట్లు వేయాలి కదా. మాకు ఏ పార్టీతో పొత్తులు ఉండవు' అని స్పష్టం చేశారు.

## మన బాధ జనం బాధ అనుకుంటే జనం నమ్మరు.. కవితకు పరోక్షంగా చురకలంటించిన కేటీఆర్ !



- “మన బాధ జనం బాధ అనుకుంటే నమ్మరు” వ్యాఖ్య
- కొత్త పార్టీలపై వ్యంగ్యం, ఓటర్ల నిర్ణయంపై ప్రశ్న
- కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై చర్చ హాట్ టాపిక్
- బీఆర్ఎస్‌కు ఎలాంటి పొత్తులు లేవని స్పష్టం
- “మేం తప్పులు చేశాం.. అందుకే ఓడిపోయాం” అంగీకారం
- కాంగ్రెస్--బీజేపీ ఒక్కటే అంటూ విమర్శ
- డీలిమిటేషన్, “వన్ నేషన్--వన్ ఎలక్షన్”పై వ్యాఖ్యలు

**మంచిర్యాల:**
మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో చిట్?చాట్ చేశారు. తన సోదరి కవిత కొత్త పార్టీ ఆలోచనపై కేటీఆర్ ఈ చిట్ చాట్?లో సెటైర్లు పేల్చారు. కొత్త పార్టీలు ఎన్ని వస్తే అంత మంచిదేనని, కానీ జనం ఓట్లు వేయవద్దా అని కేటీఆర్ ప్రశ్నించారు. మన బాధ జనం బాధ అనుకుంటే జనం నమ్మరని కవితకు కేటీఆర్ పరోక్షంగా చురకలంటించారు. తమకు ఏ పార్టీతో పొత్తులు, సర్దుబాటులు ఉండబోవని కేటీఆర్ స్పష్టం చేశారు. చంద్రుడు తాత్కాలికంగా మబ్బుల సాటుకు పోయాడని, మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.తాము తప్పులు చేశామని, అందుకే ఓడిపోయామని కేటీఆర్ అంగీకరించారు. బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వాళ్లతో చెట్టాపట్టాలు వేసుకుంటున్నారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని.. 179 అసెంబ్లీ స్థానాలకు తెలంగాణలో నియోజకవర్గాలు పెరుగుతాయని డీలిమిటేషన్ గురించి కేటీఆర్ వివరించారు. 25 ఎంపీ స్థానాలు, 60 ఎమ్మెల్సీలు పెరుగుతాయని చెప్పారు. 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' కూడా వచ్చే అవకాశం ఉందని.. ఎన్ని స్థానాలు పెరిగినా తమకు సరిపడా నాయకులు ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటుకు ఇప్పటికే ముహూర్తం ఫిక్స్ చేసుకున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్?25న కవిత పార్టీని అధికారికంగా ఏర్పాటు చేయబోతున్న సంగతి తెలిసిందే. ధర్మగంటను పార్టీ గుర్తుగా ఎన్నికల కమిషన్?కు అప్లికేషన్ పెట్టుకోబోతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కవిత కొత్త పార్టీ ఏర్పాటుకు ముమ్మర కసరత్తు చేస్తున్న క్రమంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి.




## వెనుదిరిగే ప్రసక్తేలేదు: అంబటి రాంబాబు

పుత్తూరు:
పోలీసుల తీరు విమర్శలకు తావిస్తోందని ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు.ప్రజాసమస్యలపై నిరసనలు తెలిపితే అక్రమ కేసులు పెడుతున్నారని చెప్పారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని తంబిరెడ్డిని కిడ్నాప్ చేసి, మూడు రోజుల తర్వాత పోలీసులు కేసు పెట్టారని తెలిపారు. పుత్తూరులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటికి అంబటి రాంబాబు వెళ్లారు.

2 లో



## అల్లూరి జిల్లాలో విషాదం.. ఈతకు వెళ్లి ముగ్గురు బాలురు మృత్యువాత

పన్నెడ:
అల్లూరి సీతారామరాజు జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పెదబయలు మండలం పన్నెడ గ్రామంలో ముగ్గురు బాలురు ఈతకు వెళ్లి మృత్యవాత పడిన ఘటన ఆ గ్రామంలో విషాదాన్ని నింపింది.

# రాష్ట్రంలో దోచుకో.. దాచుకో స్కీమ్

## మంచిర్యాల నస్పూర్‌లో కార్యకర్తల సమావేశం



- ముస్సిపల్ ఎన్నికల్లో అవినీతి, ప్రలోభాల ఆరోపణలు
- బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని విమర్శ
- సింగరేణిలో సీఎం బంధువుల బెదిరింపులు అన్న ఆరోపణ
- కాంగ్రెస్‌పై గ్యారెంటీల అమలులో విఫలం అంటూ విమర్శ
- కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం అంటున్నారు
- రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం అన్న ధీమా

మంచిర్యాల:
రాష్ట్రంలో దోచుకో..దాచుకో లాంటి కొత్త స్కీమ్ నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. క్యాతనపల్లిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంత్రి వివేక్ నీచమైన రాజకీయాలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. కౌన్సిలర్లను కోట్ల రూపాయలు ఇస్తానని ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వకుంటే కౌన్సిలర్ భూమాగౌడ్ ఇల్లు కూలగొట్టారని అన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ కార్యకర్తలు తలొగ్గలేదని క్యాతనపల్లిలో చూపెట్టిన స్ఫూర్తిని పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా చూపాలన్నారు.

మిగతాద్ది 2 లో

### బిల్లుకు మద్దతివ్వకుంటే

# చరిత్రహీనులు

- మహిళలకు 33% రిజర్వేషన్ లక్ష్యం
- అన్ని పార్టీల మద్దతు కోరింపు
- నరేంద్ర మోదీ లేఖ ద్వారా అపిల్
- ఏప్రిల్ 16--18 ప్రత్యేక సమావేశాలు
- బీజేపీ ఎంపీలకు త్రీ-లైన్ విప్



కేంద్రప్రభుత్వం తీసుకవచ్చిన మహిళా బిల్లును అడ్డుకంటే చరిత్ర హీనులవుతారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పార్లమెంటులో మహిళా బిల్లుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమని.. మహిళల ప్రాతినిథ్యం పెరగాల్సిందేనన్నారు.అయితే అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్లకు లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలని కోరారు. కాగా ఈ నెల 16,17,18 తేదీలలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి.ఈ నేపథ్యంలో బీజేపీ తమ పార్టీ ఎంపీలకు త్రీ-లైన్-విఫ్ జారీ చేసింది. ప్రభుత్వం కొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించుకునే అవకాశం ఉన్నందున సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపింది.

## బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో భారీ మోసం!




హైదరాబాద్:
బేగంపేట యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లో భారీ మోసం జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తాజాగా బ్యాంక్ మేనేజర్ వెంకటరమణను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వినియోగదారుడి ఖాతా నుంచి రూ.6.5కోట్లు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను విదేశాల్లో ఉన్న సమయంలో ఇదంతా జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతకం ఫోర్జరీ చేసి 42 లూజ్ లీఫ్ చెక్కులు వినియోగించారని అందులో పేర్కొన్నారు.

2లో..

## తొలి జీతం అన్నదాతలకే..

### ఉదారత చాటుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మనస్వి



గజ్వేల్:
తన తొలి జీతం రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు దానం చేసి ఉదారతను చాటుకుంది ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ (ఏటిగడ్డ కిష్టాపూర్)కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి రాజు కుమార్తె పులి మనస్వి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి

కరపత్రం తెలుగు దిన పత్రిక

సోమవారం ఏప్రిల్ 13, 2026

# రాష్ట్రంలో దోచుకో.. దాచుకో స్కీమ్

మొదటిపేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యే సుమన్‌ను అక్రమ కేసులు పెట్టి ఆదిలాబాద్ జైల్లో పెట్టించి సదుపాయాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేశారని మున్సిపల్ ఎన్నిక సమయంలో మహిళా కౌన్సిలర్లపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అసభ్యంగా ప్రవర్తించినా మంత్రి వివేక్ చూసుకుంటూ కూర్చున్నారని అన్నారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ కార్యక్రమం పెట్టి కాంట్రాక్టర్లను సీఎం బంధువులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లో మెడికల్ బోర్డు పెట్టకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 16 వేల ఉద్యోగాలపై ఏసీబీతో విచారణ జరిపిస్తామని సీఎం అనడం శోచనీయమని, కాంగ్రెస్ నాయకులను సింగరేణి కార్మికులు అడ్డుకొని నిలదీయాలని పిలుపునిచ్చారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యిందని, కాంగ్రెస్ చేసే దోపిడిపై బీజేపీని సీబీఐచే విచారణ జరిపించాలని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణాలో లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు 52 కోట్లు కేటాయించి, ప్రాజెక్ట్ కడతామని మాయమాటలు చెప్తోందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాబోయే సింగరేణి ఎన్నికల్లో TBGKSను గెలిపించాలని కేటీఆర్ సింగరేణి కార్మికులకు పిలుపునిచ్చారు.

## అల్లూరి జిల్లాలో విషాదం..
## ఈతకు వెళ్లి ముగ్గురు బాలురు మృత్యువాత

మొదటిపేజీ తరువాయి

వాగులో ఈతకు వెళ్లడంతో ముగ్గురు బాలురు మృతిచెందారు. మొత్తం ఐదుగురు బాలురు బ్యాచ్‌గా ఈతకు వెళ్లగా, ఇద్దర్ని స్థానికులు రక్షించారు. మృతి చెందిన బాలురుని ప్రదీప్(11), హర్షిత్(10), బబ్లూ(11)లుగా గుర్తించారు.

ఇటీవలే ల ఏజెన్సీలోని వాగులో స్నానానికి దిగి ముగ్గురు బాలికలు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం మూలగుమ్మి జలపాతంలో జరిగిన దుర్ఘటనలో ముగ్గురు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా మరో దుర్ఘటన చోటు చేసుకోవడంతో స్థానికంగా కలకలం రేగింది.

## వెనుదిరిగే ప్రసక్తేలేదు – అంబటి రాంబాబు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. పోలీసులతో అణచివేయాలని చూస్తే వెనుదిరిగే ప్రసక్తేలేదని అన్నారు. బలిజలు, కాపులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. పవన్ కల్యాణ్ స్పందించకుంటే కాపులను మోసం చేసినట్లేనని చెప్పారు.

కాగా, కొన్ని రోజుల క్రితం పోలీసులు తిరుపతి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సర్పంజరి తంబిరెడ్డిని గుంటూరుకు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. రెండు రోజులపాటు అజ్ఞాతంలో ఉంచి, చిత్రహింసలు పెట్టారు. కుటుంబ సభ్యులు తిరుపతిలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. తంబిరెడ్డి జాడకోసం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు కావడం.. ఈ వ్యవహారాన్ని న్యాయమూర్తి సీరియస్‌గా పరిగణించడంతో ఎట్టకేలకు గుంటూరు లాలాపేట పోలీసుల అదుపులో ఉన్నట్టు హైకోర్టుకు సమాచారం ఇచ్చారు.

మరోవైపు, బాపట్లలో ఆదివారం (ఏప్రిల్ 12) చెరుకుపల్లి ఎస్సై అనిల్‌కుమార్ ఓవరాక్షన్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణార్జునరెడ్డిని చితకబాదారు. వైఎస్సార్‌సీపీ నేతల పోస్టులను స్టేటస్ పెట్టుకున్నందుకు దాడి చేశారు. ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స అందుతోంది.

## బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో భారీ మోసం!

మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో బ్రాంచ్ సీనియర్ అధికారులు, ఆపరేషన్స్ టీమ్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించినట్లు తెలుస్తోంది. అనుమతి లేకుండానే బ్యాంక్ ఖాతా క్లోజ్ చేశారని, సీఈవో దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతోపాటు అనేక మంది బ్యాంక్ ఖాతాల నుంచి కూడా నగదు మాయమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. బ్రాంచ్ మేనేజర్ వెంకటరమణను కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

## తొలి జీతం అన్నదాతలకే.. ఉదారత చాటుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మనస్వి

మొదటిపేజీ తరువాయి

చేసి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం సాధించారు.

ఈ నెల 10న మనస్వి తన మొదటి నెల వేతనాన్ని అందుకున్నారు. ఆ డబ్బును తన సొంత అవసరాలకు వాడుకోకుండా రైతు కుటుంబాలకు వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఐదుగురు బాధిత రైతు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదుతో పాటు చీరలను అందజేశారు. చిన్న వయసులోనే సామాజిక బాధ్యతను చాటుకుని, ఆపదలో ఉన్న రైతు కుటుంబాలకు అండగా నిలిచిన మనస్విని పలువురు ప్రముఖులు, గ్రామస్థులు అభినందించారు.

## నర్మదాలో 11వేల లీటర్ల పాలు ఒలకబోత
## పర్యావరణవేత్తల ఆందోళన

మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లా భైరూందా సమీపంలో నర్మదా నది తీరాన నిర్వహించిన ఓ ఆధ్యాత్మిక ఉత్సవం ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. నది స్వచ్ఛతను కాపాడాలని ప్రార్థిస్తూనే, ఏకంగా 11,000 లీటర్ల పాలను నదిలోకి ఒంపడంపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భైరూందా ప్రాంతంలో గత 21 రోజులుగా భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుక ముగింపు సందర్భంగా నర్మదా నదికి 'దుగ్ధాభిషేకం' నిర్వహించా లని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందులో భాగంగా.. ట్యాంకర్ల ద్వారా భక్తులు జయజయ ధ్వానాల మధ్య

సుమారు 11,000 లీటర్ల పాలను నేరుగా నర్మదా నదిలోకి వదిలేశారు. నది స్వచ్ఛంగా ఉండాలని కోరుకుంటూ ఈ అభిషేకం చేశామని వారు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. నదిని పూజించడం వరకు బాగానే ఉన్నా, పాలను ఈ స్థాయిలో నీటిలో కలపడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు నీటిలో కలిగినప్పుడు అవి కుళ్ళిపోయే క్రమంలో నీటిలోని కరిగిన ఆక్సిజన్ వేగంగా తగ్గిపోతుంది. ఇది చేపలు, ఇతర జలచరాల మరణానికి కారణమవుతుంది. అంతేకాదు, పాలలో ఉండే సేంద్రియ పదార్థాల వల్ల నీటిలో హానికరమైన బ్యాక్టీరియా వృద్ధి చెంది, నీరు కలుషితం అవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నదులను పవిత్రంగా భావించడం భారతీయ సంస్కృతిలో భాగమే అయినప్పటికీ, ఆ పవిత్రతను కాపాడే క్రమంలో పర్యావరణానికి నష్టం చేకూర్చడం సరికాదని మేధావులు సూచిస్తున్నారు.

## వాటర్ బిల్లు బకాయిల పేరుతో మెసేజ్‌లు
## లింకులు ఓపెన్ చేయవద్దని హెచ్చరిక

**– అప్రమత్తంగా ఉండాలన్న కమిషనర్ సజ్జన్నార్**

హైదరాబాద్ నగరంలో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయని హైదరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వాటర్ బోర్డు బిల్లుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, వారి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ మోసాలు ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పేరుతో జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. ఈ మేరకు సీపీ సజ్జనార్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ పెట్టారు. మీ నీటి కనెక్షన్ కట్ చేస్తామంటూ వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌లతో భయపడవద్దని అన్నారు. సైబర్ కేటుగాళ్లు పన్నే వలలో చిక్కుకోవద్దని చెప్పారు. వాటర్ బోర్డు పేరుతో జరుగుతున్న ఈ కొత్త సైబర్ మోసాలు ప్రజలను లక్ష్యంగా చేసుకుంటారని తెలిపారు. ప్రజల భయాన్ని ఉపయోగించి వ్యక్తిగత సమాచారం, డబ్బును దోచుకునే ఈ తరహా స్కామ్‌లపై అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తమ కష్టార్జితాన్ని రక్షించుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్లు ముందుగా వినియోగదారులకు ఫోన్ చేసి, 'మీ వాటర్ బిల్లు బకాయి ఉందని, వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ

విధంగా ప్రజల్లో భయాన్ని సృష్టించి, ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఆ తర్వాత ఒక అనుమానాస్పద లింక్‌ను పంపి, దాన్ని డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలని సూచిస్తున్నారని చెప్పారు. ఇది అసలు అధికారిక యాప్ కాకుండా మాల్వేర్‌తో కూడిన ఫేక్ అని పోలీసులు హెచ్చరించారు. ఈ ఫేక్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. దీంతో వారు ఫోన్ కాల్స్‌ను డైవర్ట్ చేయగలరని, మెసేజ్‌లు, క్షిఖలను చదవగలరని, బ్యాంకింగ్ యాప్‌లను గమనించాలన్నారు. యూజర్ తెలియకుండానే ట్రాన్సాక్షన్లు చేయగలరని చెప్పారు. ఈ విధంగా క్షణాల్లో బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. నగర పాలక సంస్థలు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఏ ంఖఐ ÷ల్‌ను కూడా ఇన్‌స్టాల్ చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలు తమ నీటి బిల్లులను కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే చెల్లించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే వెంటనే స్పందించకుండా అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## సూళ్లూరుపేట జ్యువెలరీ చోరీ కేసు ఛేదన
## తమిళనాడుకు చెందిన పాత నేరస్తుడి అరెస్ట్

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో సంచలనం రేపిన జ్యువలరీ రాబరీ కేసును పోలీసులు ఛేదించారు. తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర నేరస్థుడు వేల్మురుగన్ బాబు అలియాస్ పల్సర్ బాబు అరెస్టు కావడం కేసుకు కీలక మలుపు తిరిగింది. మార్చి 14న మధ్యాహ్నం సుమారు 2–30 గంటల సమయంలో శ్రీ వెంకటేశ్వర జ్యువెలరీ షాపులో కస్టమర్ వేషంలో ప్రవేశించిన నిందితుడు సినీ పక్కిలో విధంగా యజమాని వెంకటేశ్వర్లు కళ్ళల్లో కారంపొడి చల్లి 12 బంగారు గొలుసు నందు దోచుకుని పరారయ్యాడు. సుమారు 14 లక్షల విలువైన ఈ ఆభరణాలు క్షణాల్లో మాయం అవడంతో పట్టణంలో కలకలం చెల్లరేగింది. దశాబ్ద కాలంగా నేర జీవితం గడుపుతున్న నిందితుడు తమిళనాడులోనే 24 కేసుల్లో నిందితుడిగా ఉండి అందులో 16 రాబరీలు, 7 దొంగతనాలు, ఒక హత్యాయత్నం కేసులు ఉన్నాయి. పలు నాన్ బెయిల్ వారింట్ లు పెండింగ్ లో ఉండగా, తిరుపతి జిల్లాలోని పుత్తూరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో కూడా శిక్ష అనుభవించాడు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో అదనపు ఎస్పీ శ్రీనివాసులు, నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు, పర్యవేక్షణలో సూళ్లూరుపేట సి.ఐ.మురళీకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టి, సూళ్లూరుపేట ఎస్సై జి. అజయ్ కుమార్, తడ ఎస్సై కే. కొండప్ప నాయుడు, ఏ.ఎస్.ఐ. పులిచెర్ల శ్రీ కుమార్ రెడ్డి చాకచక్యంగా ఏప్రిల్ 11 ఉదయం సత్యవేడు పట్టణంలో బిఎస్ఎన్ఎల్ సమీపంలోని మెకానికల్ షాపు వద్ద నిందితుని అదుపులోకి తీసుకుంది. నిందితుడి వద్ద నుంచి దొంగలించిన 12 బంగారు గొలుసులు నేరానికి ఉపయోగించిన స్కూటీ స్వాధీనం చేసుకోవడంతో కేసుకు పూర్తి పరిష్కారం లభించింది. నేరం ఎంత చాకచక్యంగా ఏన్నుకొన్న చట్టం కన్నుల నుండి తప్పించుకుపోవడం అసాధ్యం అనే విషయాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

## టోల్‌గేట్ వద్ద ప్రమాదం
## కారుపైపడ్డ భారీ కాంక్రీట్ మిక్సర్

ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళుతున్న బీఎండబ్ల్యూ కారు టోల్‌గేట్ దాటుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ కాంక్రీట్ రెడీమిక్సర్ లారీ అదుపుతప్పి కారుపై బోల్తా పడింది. లారీ బరువుకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న ప్రయాణికులు లోపలే మరణించినట్లు సమచారం. ప్రస్తుతం జేసీబీ సహాయంతో లారీని పక్కకు తొలగించి, కారులో చిక్కుకుపోయిన బాధితులను బయటకు తీసేందుకు అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల ఐటిడిఎల బలోపేతం
## ఒకరోజు కార్యశాలలో కేంద్ర డైరెక్టర్ సమీక్ష

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐటీడీఏల బలోపేత చర్యలపై కేంద్ర ప్రభుత్వం, గిరిజన మంత్రిత్వ శాఖ, హైదరాబాద్ లోని మాసబ్ టాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో కార్యశాల నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి దేకా హాజరయ్యారు. సమావేశంలో ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలియచేస్తూ డా. వి. సముజ్వల, సంచాలకులు, గిరిజన సాంస్కృతిక – శిక్షణా సంస్థ ఈ కార్యశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి హాజరైన గిరిజన సంక్షేమ శాఖ, ఐటిడిఏ అధికారులకు స్వాగతంపలికారు. ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, విభిన్న రాష్ట్రాలలో అమలు అవుతున్న విధానాలలో తేడాలు, నిధుల వినియోగ విధానాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ఐటీడీఏల ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని భావించారు.

గిరిజన ప్రాంతాలలో జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించారు. తెలంగాణ అకాడమీ

ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ద్వారా యువతకు శిక్షణ అందించడం పై చర్చ జరిగింది. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణ వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ జరిగింది. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. గిరిజన విద్యా అభివృద్ధిలో భాగంగా స్థానిక భాషలలో ప్రాథమిక విద్య, కెరీర్ గైడెన్స్, మరియు ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాలలో 100శాతం ఎస్సెస్సీ ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించారు. అంతేకాక, గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కార్యక్రమాల అభివృద్ధిపై చర్చించారు.

## జువ్వలదిన్నె హార్బర్‌పై పుకార్లు
## హార్బర్‌ని ప్రైవేటు పరం చేసే ప్రసక్తేలేదు

జువ్వలదిన్నె హార్బర్‌పై పుకార్లు, అసత్య ప్రచారాలు నమ్మొద్దని.. హార్బర్‌ని ప్రైవేటు పరం చేసే ప్రసక్తేలేదని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణపట్నం పోర్టుకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని ప్రస్తావించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2008లో కృష్ణపట్నం నుంచి వాడరేవు వరకు ఎలాంటి పోర్టులు రాకూడదని జీవో ఎంఎస్ నంబర్– 40 ఇచ్చారని గుర్తుచేశారు. శనివారం నెల్లూరులో సోమిరెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టుపై పెత్తనం కోసం తండ్రిని అడ్డం పెట్టుకుని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవో తెప్పించారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహించారు. పోర్టులు, హార్బర్లు, చివరకు జెట్టీలు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలోనే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌లు వచ్చాయని తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారంతో హార్బర్ తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా 900 మీటర్ల జెట్టీతో హార్బర్ తెచ్చామన్నారు. బ్లూ రివల్యూషన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.130కోట్లు, టీడీపీ ప్రభుత్వం రూ.150కోట్లు నిధులతో జువ్వలదిన్నె హార్బర్‌ని తాము తీసుకువచ్చామని తెలిపారు. జగన్ ఈ నెల 15వ తేదీన జువ్వలదిన్నెకి వస్తానంటున్నారని.. ఏమి చెప్పేందుకు జగన్ వస్తున్నారని ప్రశ్నించారు. పోర్టులు, హార్బర్‌లు, జెట్టీలు రాకుండా జీవో తెప్పించానని చెబుతావా? ఐదేళ్లుపాటు జువ్వలదిన్నె హార్బర్ పూర్తి చేయలేకపోయామని చెబుతావా? అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్‌ని అడ్డుపెట్టుకుని జగన్ అడ్డగోలు జీవోలు తెచ్చారని మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా పనిచేశావని... నోటికొచ్చినట్లుగా మాట్లాడవద్దని హితవు పలికారు. రూ.288కోట్ల నిధులు తాము తెస్తే... జగన్ హయాంలో నిర్మించడానికి ఐదేళు పట్టిందని ప్రస్తావించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మల్టీపర్పస్ జువ్వలదిన్నె హార్బర్‌ని మూడు నెలల్లో మత్స్యకారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. జువ్వలదిన్నె హార్బర్‌కి 123 ఎకరాల భూమి ఉందని.. 200 బోట్లు వచ్చి నిలిచే అవకాశం ఉందని వెల్లడించారు. జగన్ ఏ రోజైనా ఢిల్లీకి వెళ్లి, ఒక్క ప్రజా ప్రయోజనకర జీవో తీసుకువచ్చావా..? అని ప్రశ్నించారు. సాగర్ డిఫెన్స్ పరిశ్రమతో మత్స్యకారులకు అత్యాధునిక టెక్నాలజీ, ఉపాధి అందుతాయని

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సహం అవసరం..
## అంతర్జాతీయ క్రీడాకారులుగా రానించాలి..

**కృష్ణా నదీ తీరంలో వాటర్ స్పోర్ట్స్‌కు ఊపు..**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.**

క్రీడాకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాన్ని అందిపుచ్చుకుని అంతర్జాతీయ క్రీడాకారులుగా రానించేందుకు కృషి చేయాలని వాటర్ స్పోర్ట్స్ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. వాటర్ స్పోర్ట్స్‌లో యువతను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడా సంస్థ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పున్నమి ఘాట్ వద్ద కృష్ణానదిలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ పోటీలను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది తీర ప్రాంతంలో నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ యువక్రీడాకారులలో నూతన ఉత్సహాన్ని నింపడంతో పాటు పర్యాటకులకు వినోదాన్ని అందించడం అభిందనీయమన్నారు. వినోదంతో కూడిన సాహస క్రీడాలపై యువతలో ఆశక్తి పెంచేందుకు వాటర్ స్పోర్ట్స్ ఎంతో దోహదపడుతాయన్నారు. జెట్ స్కీయింగ్, బనానా రైడ్స్, కయాకింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొనడంతో పాటు పోటీలను విక్షించేందుకు సందర్శకులు భారీగా తరలిరావడం శుభపరిణామమన్నారు. చిరువ్యాపారస్తులకు ఇది ఒక మంచి అవకాశంగా మారిందన్నారు. వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ఊతం ఇవ్వనుందని అయితే పర్యావరణ పరిరక్షణ, నదీ నీటి కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలను ప్రవేశపెట్టి, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. శాప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఎస్. భరణి మాట్లాడుతూ క్రీడాకారులు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నదీ తీర ప్రాంతాలలో జల క్రీడలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. జల క్రీడలలో రాష్ట్రాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోటీలలో 275 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా కోర్చులు మేనేజర్లు విజయవంతంగా పోటీలను నిర్వహించడంలో భాగస్వామం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, కయాకింగ్ కనోయంగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బలరామ్‌నాయుడు, చైర్మన్ ప్రదీప్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి కనకరావు, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కాకాని తరుణ్, వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వాలంభనకు స్వయం ఉపాధి కీలకం..

**– మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయాలన్నదే లక్ష్యం..**
**–జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

మహిళల ఆర్థిక స్వాలంభన సుస్థిర భవిష్యత్తుకు స్వయం ఉపాధి మార్గాలు కీలక పాత్ర వహిస్తాయని రైజ్ సెంటర్ ద్వారా మహిళలకు చేతి వృత్తులపై శిక్షణ ఉపాధి అవకాశాలపై వర్క్‌షాప్‌లను నిర్వహించి ప్రతి మహిళాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడ రూరల్ మండలం గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన రైజ్ శిక్షణ కేంద్రంలో సోలార్ ఫోటోవాల్‌టిక్ టెక్నిషన్ శిక్షణ పొందిన 28 మంది మహిళలకు టూల్ కిట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం 50 మంది మహిళలకు తేనెటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైజ్ సెంటర్ ద్వారా మహిళలు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపాధిగా మార్చుకుని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ, సహాయక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అడుగులు వేయాలన్నారు. మహిళలు పొందుతున్న శిక్షణను కేవలం నేర్చుకోవడానికే పరిమితం కాకుండా, ఆచరణలోకి తీసుకువచ్చి ఆదాయ మార్గాలుగా మార్చుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలను వినియోగించుకుని పారిశ్రామిక, వ్యాపార యూనిట్లు ప్రారంభించాలన్నారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్న వాసవ్య మహిళా మండలి గోకుల్ ఎంటర్ ప్రైజెస్ సంస్థల ప్రతినిధులను అభినందిస్తున్నానన్నారు, మహిళలకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్ ట్యాంజోర్ పెయింటింగ్ శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన శ్రీమతి ప్రతిభను ప్రత్యేకంగా దార్శినీకత ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి కీర్తి, గోకుల్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ శ్రీమతి వడ్డీ సంతోషిలక్ష్మీ, మహేష్, శ్రీమతి ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 13, 2026

# వేగం కన్నా ప్రాణం ముఖ్యం..

- తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి
- అర్మ్‌డ్ అధికారుల, సిబ్బంది నూతన పోలీసు నివాస భవనాలను ప్రారంభించిన డీజీపీ





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 12:** రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డిని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు సాదరంగా పూల మొక్క అందజేసి ఆహ్వానించారు. కమిషనరేట్ సాయుధ పోలీసు సిబ్బంది గౌరవవందనం సమర్పించి డీజీపీకి స్వాగతం పలికారు.

అనంతరం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పోలీస్ అధికారులతో కలిసి రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్... అలైవ్" కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించాలని సూచించారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు ఒక సామాజిక సమస్యగా మారాయని, వాటిపై విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. ఇందుకోసం ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే "అరైవ్... అలైవ్" కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మరణాలను గణనీయంగా తగ్గించడం అత్యంత అవసరమని పేర్కొంటూ, ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు.

"వేగం కన్నా ప్రాణం ముఖ్యం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరికి చేరేలా చేయాలని, అరివ్, ఆలివ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక శిక్షణలు నిర్వహించడం, సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాల పట్ల నిర్లక్ష్యం ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల్లో బాధితుల కుటుంబ సభ్యుల అనుభవాలు, అభిప్రాయాలను ప్రజలతో పంచుకోవడం ద్వారా అవగాహన మరింత పెరుగుతుందని సూచించారు. ప్రస్తుతం నేరాలు కొత్త రూపాలు దాల్చుతున్నాయని, నేరస్తులు టెక్నాలజీ వినియోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అందువల్ల ప్రతి అధికారి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు ప్రజల్లో కూడా అవగాహన పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు.

అనంతరం గోదావరిఖని ఐబీ కాలనీలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.12.29 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన పోలీస్ క్వార్టర్స్‌ను ప్రారంభించారు. ఈ క్వార్టర్స్ నిర్మాణ పనులు 2024 ఫిబ్రవరి 22న ప్రారంభమయ్యాయి. మొత్తం ఒక ఏసీపీ హౌస్, రెండు ఆర్ఐ క్వార్టర్స్,నాలుగు ఆర్ఎస్ఐ క్వార్టర్స్, 12 ఏఆర్ఎస్ఐ క్వార్టర్స్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల కోసం నివాస గృహాలను నిర్మించారు. పోలీసు సిబ్బందికి మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఆధునిక భవనాలు పోలీసు సిబ్బందికి మెరుగైన నివాస వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నాయని డీజీపీ అన్నారు. రామగుండం కమిషనరేట్ పోలీస్ ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్-× ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, టీజీపీఐసీఎస్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గీత్, ఏసీపీలు, సీఐలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాననే మానస్థాపంతో ఉరి వేసుకొని విద్యార్థి ఆత్మహత్య

- వారంలో ఇంటిలో వివాహ సంబరాలు అంతలోనే విషాద ఛాయలు
- వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో ఘటన
- కన్నీరు మున్నీరుగా కుటుంబ సభ్యులు



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 12** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాననే మనస్థాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన చాకలి సాయిలు-నాగమణి దంపతుల కుమారుడు సాయిరాం (17) హైదరాబాద్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూప్లో చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు రాసిన సాయిరాం, ఆదివారం విడుదలైన ఫలితాలను చూసుకోగా రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్థాపానికి గురైన సాయిరాం, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజుల్లో సోదరి మహేశ్వరి వివాహ ఏర్పాట్ల కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్కు వెళ్లిన సమయంలో ఎవరు లేరు అని తన స్వభావంతో మానసికంగా బాధతో తమ తోటి స్నేహితులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులు కావడంతో తాను కాలేను అనే మనస్థాపం చెందిన తాను తన జీవితంపై విరక్తి చెంది తన ఇంటిలోనే ఉరి వేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఉరి వేసుకున్న బాధితుడి తల్లిదండ్రుల ఆక్రందన అంతా అంతా కాదు వారం రోజుల్లో తమ కుమార్తె వివాహం ఉండగా, ఏకైక కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమైంది. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ సంధ్యా రామకృష్ణారావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులను పరామర్శించి దెర్యం చెప్పారు. ఇలాంటి సంఘటనలు గ్రామంలో ఇకముందు ఇలాంటి సంఘటనలువాటిల్ల వద్ద నీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకుంటే ప్రాణాలు తీసుకోవడం సరి అయిన నిర్ణయం కాదని ఇకముందు అయినా చదువుకుంటున్న విద్యార్థులు విద్యార్థులు చదువులో ఉత్తీర్ణులు కాకపోయినా జీవితంపై విరక్తి చెందడం అసమత ధైర్యమని అలాంటి తీసుకోవడం సబబు కాదని జీవితం అనే జీవిత నావాను నడిపిన వారే ధైర్యస్తుడని ఇంటర్ విద్యార్థి తాను మానసికంగా బాధపడుతూ ఉరి వేసుకోవడం ఎంతో బాధాకరమని వారు తెలియజేశారు ఇకముందైన ఇలాంటి సంఘటనలను గ్రామంలో వెలుగు చూపద్దని ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువచ్చి చెబితే తాను వారికి ఎంతో సహకరిస్తానని మంగలపర్తి సర్పంచ్ సంధ్య రామకృష్ణ తెలియజేశారు

## రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ దశాబ్ది ఉత్సవాలు -- హిందూ సమ్మేళనానికి ఆహ్వానం

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 12**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 21వ తేదీ మంగళవారం పెద్ద పాపయ్యపల్లె ఉప మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.పెద్ద పాపయ్యపల్లె, చిన్న పాపయ్యపల్లె, ఉప్పల్ నర్సింగాపూర్, దమ్మకపేట, కాట్రపల్లి గ్రామాల పరిధిలో నిర్వహించబడే కేసీ క్యాంప్, శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణంలో జరగనుంది.ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు ప్రజలను కోరారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హిందూ సమ్మేళనం సమితి అధ్యక్షులు గూడూరి మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి సర్వోత్తమ్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యక్షులు కిషన్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ విభాగ సంఘటన మంత్రి రామకృష్ణ, భారతీయ జనతా యువ మోర్చా నాయకులు నరెడ్ల ప్రవీణ్, గోస్కుల అజయ్, చరణ్ తదితరులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ - 2026 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయభేరి



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 12** ఆదివారం రోజున ప్రకటించినబడిన ఇంటర్-2026 ప్రథమ , ద్వితీయ ఫలితాలలో కరీంనగర్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మ్రోగించారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బొకెలతో సత్కరించారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా అభ్యసించి గణనీయమైన మార్కులు సాధించి మెరుగైన ఫలితాలను రాబట్టారు. అంకిత భావంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. ప్రతిభావంతుల వివరాలు రెండవ సంవత్సర ఫలితాలలో యం.పి.సి నందు 995 (బి. శశికుమార్, కె. మైత్రి, యు. చారు హాసిని) 994(యం. సాత్విక, శ్రీ. శ్రీనిత్య, డి. ప్రవల్లిక) 990 కి పైగా (20 విద్యార్థులకు) బై.పి.సి నందు 994( బి. లహరి, ఓ. శినివాసన్) 994(సి.హెచ్. కార్తీక్) 980 కి పైగా (18విద్యార్థులకు), యం.ఇ.సి నందు 974 పి వల్లవి రాజయ్య. సి.ఇ.సి నందు 984 అంజలి కిలేరి మార్కులు సాధించిరు. మొదటి సంవత్సర ఫలితాలలో యం.పి.సి. నందు బి. ప్రశాంత్ గౌడ్ 468, 467(జి, అక్షర, ఇ. అక్షయ, కె. గిపి, యం. కళ్యాణి), 466(10 విద్యార్థులకు), 461 కు పైగా (44 విద్యార్థులకు) బి.పి.సి నందు 438 (డి. మెఘన, ఎ. సిద్ధార్) 437-(డి. మనోజ్ఞ), 431 పైగా (8 విద్యార్థులకు) యం.ఈ.సి నందు పి. లిఖిత గుప్త- 494, సి.ఈ.సి నందు సి.హెచ్. శివాత్మిక రెడ్డి 490 మార్కులు సాధించారు.

నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే ఉద్దేశ్యంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని తెలిపారు. శ్రీ చైతన్య గ్రూప్ అఫ్ జూనియర్ కళాశాలలు స్థాపించిన నాటి నుండి రాష్ట్ర స్థాయి ర్యాంకులకు కేరాఫ్ గా నిలవడం సంతోషంగా ఉందన్నారు.ప్రణాళికలతో పాటు నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల అత్యుత్తమ బోధన విద్యార్థులు పట్టుదల, అహర్నిషల కృషి ఫలితంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు , అత్యుత్తమ ఫలితాలతో విజయం సాధించారని తెలిపారు. ప్రతి ఏడాది ఎంసెట్, నీట్, ఐఐటి జేఈఈ తదితర పోటీ పరీక్షలలో విద్యార్థులు ర్యాంకులు సాధించి శ్రీచైతన్య ఆణిముత్యాలుగా నిలుస్తున్నారని తెలిపారు. అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఈ ఘన విజయంలో పాలు పంచుకున్న తమ అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి , డీన్ జగన్ మోహన్ రెడ్డి , జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మల్లారెడ్డి , రాధాక్రిష్ణ , మోహన్రావు, ఎజియం శ్రీనివాస్ అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎస్ వి జె సి ప్రభంజనం



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 12**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎస్ వి జె సి ప్రభంజనము సృష్టించి స్టేట్ లెవెల్ లో ఫలితాలు సాధించడమే కాకుండా అత్యధిక ఉత్తీర్ణత సాధించిన ఏకైక కళాశాల ఎస్ వి జె సి కళాశాలలు అని సెక్రటరీ , ప్రైవేట్ విద్యాసంస్థల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. ఒకటి, రెండు, ఫలితాలు సాధించడము గొప్ప విషయం కాదని, అత్యధిక ఉత్తీర్ణత సాధించడమే ప్రతి విద్యార్థికి, వారు చదివించిన తల్లిదండ్రులకు న్యాయం చేయడామని ఆయన అన్నారు. సామాన్యమైన కళాశాల, అసమాన్యమైన ఫలితాలతో కూడిన ఉత్తీర్ణత సాధించడంలో గత 25 సంవత్సరాల నుండి కార్పొరేట్ సంస్థలను తలదన్ని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకైక కళాశాల అని అన్నారు. నిస్నాతులైన అధ్యాపక బృందం ,నిబద్ధత కలిగిన మేనేజ్మెంట్ , క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులతో ఇంతటి విజయాలు ప్రతి ఏడాది సాధ్యమవుతున్నాయని ఆయన కొనియాడారు. ప్రకటించిన ఫలితాలలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ సంవత్సరం లో 994, 992 ,992 ,991, 991, మొదటి సంవత్సరంలో ఎంపీసీ 468 467 466, 465, 465 ,465, 464, 464,దీఅజూషె 435 434 432, సిఇసి 490 489 486 సాధించి న విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి జె సి విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్ కాంతాల రామ్ రెడ్డి, మేడ వెంకట వరప్రసాద్, సింహాచల హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి తదితరులు అధ్యాపక బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బేతిగల్ గ్రామంలో గుండెపోటుతో శ్రీధర్ రావు మృతి శోకసంద్రంలో బేతిగల్ గ్రామం




**కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 12** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మసాడి మాధవరావు రెండవ కుమారుడు మసాడి శ్రీధర్ రావు ఆదివారం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.శ్రీధర్ రావు మరణవార్త తెలిసిన వెంటనే గ్రామంలో దుఃఖ వాతావరణం నెలకొంది. బేతిగల్ గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల వారు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, అభిమానులు ఆయన మృతికి గాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, శ్రీధర్ రావు ఒక మంచితనం గల వ్యక్తి, సేవా భావం కలిగిన యువకుడు అని కొనియాడారు. ఆయన ఎప్పుడూ అందరితో కలిసిమెలిసి ఉండేవారని, అవసరమైనప్పుడు సహాయం చేయడంలో ముందుండేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన లేని లోటు కుటుంబానికే కాకుండా గ్రామానికే తీరని లోటుగా మారిందని అన్నారు.శ్రీధర్ రావు తండ్రి మసాడి మాధవరావు గారు కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం సేవలందించిన నాయకుడు కావడంతో, ఆ కుటుంబానికి రాజకీయ, సామాజికంగా మంచి గుర్తింపు ఉందని నాయకులు పేర్కొన్నారు. అలాంటి కుటుంబానికి చెందిన యువకుడు అకాల మరణం చెందడం చాలా బాధాకరమని తెలిపారు.మృతదేహాన్ని చివరి దర్శనార్థం ఉంచగా, పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి నివాళులర్పించారు. కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు వచ్చిన వారు మాటలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం శ్రీధర్ రావు అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని కోరుతూ పలువురు నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

# సరస్వతీ శిశు మందిర్ లో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 12**



సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బల్మూరి కరుణాకర్ రావు, ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, గుర్రాల మహేశ్వర్ రెడ్డి , శ్రీరాం మొండయ్య, బొడ్ల శ్రీనివాస్ - బొడ్ల గీతారాణి కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకుని భవిష్యత్ లో ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ కొత్త కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ స్కిల్స్ పెంచడశీ, ప్రాక్టికల్ జ్ఞానం పెరుగుతుందని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం పట్ల డాక్టర్ చక్రవర్తుల రమణచారి, కొత్తూరి ముకుందశీ, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళ దేవి, మేచినేని దేవేందర్ రావు, రాపర్తి శ్రీనివాస్, పాక పావన క్రిష్ణ, కొలుగురి సదాశివ రెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్, తాటి రాజేశ్వర్ రావు, తణుకు మహేష్, ఆచార్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసారు.

# జర్నలిస్ట్ ముసుగులో బ్లాక్ మెయిల్



- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- వేములవాడ పట్టణ సిఐ బి. వీరప్రసాద్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

జర్నలిస్ట్ ముసుగులో బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆదివారం వేములవాడ పట్టణ సీఐ బి వీరప్రసాద్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3వ తేదీన వేములవాడకు చెందిన ఓ సూపర్ మార్కెట్ యజమానిని గోడిశేల మహేష్ (చంద్రంపేట నివాసి) పరిచయం చేసుకుని, తనను జర్నలిస్ట్‌గా చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని, సూపర్ మార్కెట్‌పై అధికారులతో తనిఖీలు చేయిస్తానని, పత్రికల్లో ప్రతికూల వార్తలు ప్రచురిస్తానని హెచ్చరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. అంతేకాక, కత్తి చూపించి ప్రాణహాని బెదిరింపులకు దిగిన మహేష్, బాధితుని నుండి రూ. 42,000/-ను ఫోన్‌పే ద్వారా వసూలు చేశాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రామ్మోహన్ గౌడ్, కానిస్టేబుల్ గోపాల్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ప్రజల ఆరోగ్యమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

**- బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 12**



దేశ ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీజేపీ సీనియర్ నాయజకులు మట్ట పవన్ రెడ్డి పేర్కొన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. వేసవికాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ముందస్తుగా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని పవన్ రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు గొప్ప ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. ప్రజల అవసరాలను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ధరల భారంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ విధానం ఆహార భద్రతను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను అమలు చేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని మట్ట పవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఆలస్యంగా ఇస్లామాబాద్ చర్చలు

**- దౌత్యం విఫలం అయితే పంథా మార్చుకుంటామన్న ట్రంప్**

యూఎస్, ఇరాన్‌ల మధ్య ఇస్లామాబాద్ వేదికగా చర్చలు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. చర్చలకు ముందే ఇరాన్ పలు షరతులు విధించిందన్న వార్తల నేపథ్యంలో దాదాపు ఐదు గంటల ఆలస్యంగా చర్చలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లో నిజాయతీ ఎంత ఉందో గమనిస్తుంటానని అన్నారు. చర్చల ఫలితం ఎలా ఉంటుందో తాను చెప్పలేనని కూడా అన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఇరాన్‌ను విఫలమవుతున్న దేశంగా అభివర్ణించారు. దౌత్యం విఫలమైతే యూఎస్ తన పంథాను పూర్తిగా మార్చుకుంటుందని అన్నారు. ఇరాన్‌తో మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందని పరోక్షంగా సంకేతాలిచ్చారు. 'సమీప భవిష్యత్తులోనే హోర్ముజ్ తెరుచుకుంటుంది' అని కూడా చెప్పారు. హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయాలు ఉన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఇక యూఎస్‌తో తమ ప్రభుత్వ చర్చలు కొనసాగుతాయని ఇరాన్ ప్రభుత్వ మీడియాలోనూ వార్తలు వెలువడ్డాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇస్లామాబాద్‌లో దిగాక కూడా వాన్స్ బృందం ఇరాన్‌తో చర్చలు ప్రారంభించలేదు. ఇరాన్ విధించిన షరతులు, పరస్పర అపనమ్మకం కారణంగా చర్చలు ఆలస్యంగా ప్రారంభమైనట్టు సమాచారం. నేరుగా చర్చలు జరపడం సాధ్యం కాని పక్షంలో పాక్ మధ్యవర్తిగా త్రైపాక్షిక చర్చలు జరిగే అవకాశం ఉన్నట్టు కూడా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాలకు హాజరైన వొడితల ప్రణవ్...

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 12**





ఏళ్ల తరబడి కలగా మిగిలిన సొంతింటి స్వప్నం నెరవేరుతున్న వేళ లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ చివరి వారంలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుడనున్నట్లు ప్రకటించారు. సొంతింటి కల అనేది ప్రతి పేదవాడి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఆశయమని, అలాంటి కలలను సాకారం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హుజూరాబాద్, వీణవంక మండలాల పరిధిలోని వల్భాపూర్, జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం, కొత్తపల్లి, ఇల్లందకుంట మండలంలోని కనగర్తి, కమలాపూర్ మండలంలోని లక్ష్మీపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో జరిగిన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ప్రణవ్‌కు లబ్ధిదారులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కొత్త ఇళ్లలో అడుగుపెడుతూ ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్న కుటుంబాలు ప్రభుత్వానికి, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశాయి. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, "ఇల్లు కట్టుకోవడం మా జీవితంలో సాధ్యం అవుతుందా అనే అనుమానం ఉండేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దశలోనే మాకు ఇళ్లు మంజూరు చేసి మా కలలకు జీవం పోశారు" అని తెలిపారు. వారు కాంగ్రెస్ పార్టీకి, అలాగే వొడితల ప్రణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని, ఎవరూ ఇల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఏప్రిల్ నెల చివరి వారంలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించి మరింత మంది లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేర్చనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ మతి రాయరావు సరస్వతి కళాశాల విద్యార్థుల ప్రతిభ

- కళాశాలకు టాపర్ గా నిలిచిన విద్యార్థిని విద్యార్థులు
- సంతోషం వ్యక్తం చేసిన కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 12**



మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోనివెల్దుర్తి ప్రభుత్వ శ్రీమతి రాయరావు సరస్వతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీమతి రాయారావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం రోజు ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసులు అభినందించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలు వారు తెలియజేశారు ఫలితాల వివరాలుసీఈసీ గ్రూపుకు చెందిన బి. ఇందు (హాల్ టికెట్ నెం. 2648207002) 746/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్గా నిలిచింది. సీఈసీకి చెందిన సిహెచ్. కీర్తన (హాల్ టికెట్ నెం. 2648207009) 722/1000 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. బైపీసీ విద్యార్థిని ఏ. స్పందన (హాల్ టికెట్ నెం. 2648207020) 716/1000 మార్కులతో తృతీయ స్థానం పొందింది. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 24 మంది ఉత్తీర్ణులై 48 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది.

**ప్రథమ సంవత్సరం ఫలితాలు:**

బైపీసీ విద్యార్థిని జి. అనూష (హాల్ టికెట్ నెం. 2648107781) 356/440 మార్కులతో కళాశాల టాపర్గా నిలిచింది. బి. తేజస్విని (హాల్ టికెట్ నెం. 2648107787) 339/440 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. సీఈసీ విద్యార్థిని ఎస్‌కే. సుమయ (హాల్ టికెట్ నెం. 2648107914) 384/500 మార్కులతో తృతీయ స్థానం పొందింది. ప్రథమ సంవత్సరంలో మొత్తం 115 మంది విద్యార్థులు హాజరుకాగా, 40 మంది ఉత్తీర్ణులై 35 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపక బృందం, నాన్ టీచింగ్ సిబ్బంది టాపర్లకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి ఫలితాలను అధికమిస్తూ వెల్దుర్తి మండల కేంద్రంలోని ఉన్నటువంటి శ్రీ మతి రాయ రావు సరస్వతి కళాశాలకు జిల్లాలోని కాకుండా రాష్ట్రంలో మంచి ప్రతిభను కనబరచాలని కోరుకుంటున్నాను అని విద్యార్థిని విద్యార్థులు తమ ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠ్యాంశాలపై శ్రద్ధ చూపి చదువుకుంటే వారు భవిష్యత్తులో ఎంతో ఉన్నత శిఖరాలకు ఎదిగి వారికి తగినటువంటి ఉద్యోగాలను సంపాదించు కోవాలని ఉద్దేశ్యమే తమ తోటి ఉపాధ్యాయ సిబ్బంది తరపునని కోరుకుంటున్నానని వారు తెలియజేశారు ఆదివారం నాడు నిలబడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో మన శ్రీమతి రాయరావు సరస్వతి కళాశాల నుండి ఎంతోమంది విద్యార్థులు వారి ప్రతిభను చూపి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు పత్రిక ముఖంగా తెలపడం జరుగుతుందని నేటి విద్యార్థులే రేపటి భావితరాల భవిష్యత్తులో భావి పడడమే కాకుండా దేశ సంరక్షణ కోసం వారు ఎంతో కొంత తోడ్పడు కావాలని విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్నటువంటి చదువులు ప్రతిపను చూపియులై నా వారికి వారికి నచ్చినటువంటి ఉద్యోగాలలో ఉద్యోగాలు రావాలని కోరుకుంటున్నామని వారి భవిష్యత్తు రానున్న రోజుల్లో ఎంతో బాగుపడాలని చదువు నేర్పిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకే కాకుండా వారిని కన్నా తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరుకుంటున్నామని వారు తెలియజేశారు

# జమ్మికుంట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడా పోటీలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 12**

జమ్మికుంట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానం క్రీడా ఉత్సాహంతో నిండిపోయింది. జమ్మికుంట ప్రీమియం లీగ్ సీజన్ మూడు క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు స్థానిక శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఘనంగా బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా మొదటి బహుమతిని డి ఎల్ ఎస్ జట్టు సాధించగా, రెండవ బహుమతిని స్టేక్ పదకొండు జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఆటగాళ్ల ప్రతిభను ప్రశంసిస్తూ వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల మరింత ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, సహనాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపు ఓటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహ పడకుండా మరింత కృషి చేసి తదుపరి విజయాన్ని సాధించాలని సూచించారు. ఆటను ఆటలాగే స్వీకరించాలి తప్ప వ్యక్తిగతంగా తీసుకోకూడదని పేర్కొన్నారు.

ప్రస్తుత కాలంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి యువకుడు కనీసం ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని, తల్లిదండ్రుల పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పోటీలు స్థానిక ప్రతిభను వెలికి తీసేందుకు మంచి వేదికలుగా నిలుస్తాయని, గ్రామీణ ప్రాంతాల యువతకు తమ ప్రతిభను చాటుకునే అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్, వెంకటేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు మరియు యువత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ÷ుయోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి,